క్లుప్తంగా

మంత్రి చొరవతో బస్సు సర్వీసు ప్రారంభం

చిన్నమండెం : రాష్ట్ర రవాణా శాఖా మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి చొరవతో బస్సు సర్వీసును బుధవారం అధికారులు ప్రారంభించారు. రాయచోటి నుంచి వండాడి, చాకిబండల మీదుగా గాలివీడు వరకు ఆర్టీసీ బస్సును ఏర్పాటు చేయాలని మంత్రికి స్థానిక ప్రజలు విన్నవించారు. స్పందించిన మంత్రి అధికారులకు ఆదేశాలు జారీ చేయడంతో బస్సు ఏర్పాటు చేశారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సీజనల్ వ్యాధులతో జాగ్రత్త

లక్కిరెడ్డిపల్లి : గ్రామాల్లో సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని దేవలంపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారిణి నజీయా మెహతాజ్ పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన నీతి అభియోగ్ కార్యక్రమంలో భాగంగా సంపూర్ణత అభియాన్ కార్యక్రమంలో 40 సూచికలలో భాగంగా ఆరోగ్య పరిరక్షణ కార్యక్రమాన్ని బుధవారం దేవలంపల్లె గ్రామంలో ఏర్పాటు షుగర్, బీపీ, రక్తనమూనాలను సేకరించారు. ఈ సందర్భంగా వైద్యురాలు మాట్లాడుతూ వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ప్రజలు ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది సుదీపన, షకీలా, క్యాంప్ అధికారి వెంకటరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయురాలికి సన్మానం

లక్కిరెడ్డిపల్లి : ఉత్తమ ఉపాధ్యాయురాలు శోభారాణి పలువురికి ఆదర్శంగా నిలవడం సంతోషంగా ఉందని ఎంఈఓలు చక్రేనాయక్, వెంకటసుబ్బయ్య పేర్కొన్నారు. బుధవారం మండలంలోని అనంతపురం ఎస్సీకాలనీ ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న శోభారాణిని సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలలోని అన్ని తరగతులలో 30 మంది విద్యార్థులకు శోభారాణి ఒక్కరే అన్ని సబ్జెక్టులు బోధిస్తూ విద్యార్థుల తల్లిదండ్రుల మన్ననలు పొందడం హర్షణీయమన్నారు. హరిజనవాడ ప్రాథమిక పాఠశాలలో మౌలిక సదుపాయాలతో పాటు విద్యా ప్రమాణాలు మెరుగ్గా ఉన్నాయని వారన్నారు. మండలంలోని ఉపాధ్యాయులు విద్యార్థులలో నైపుణ్యాలను వెలికితీయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఐఎస్ కో–ఆర్డినేటర్ రామాంజనేయులు, సిఆర్‌పీలు చంద్రకళ, సుహాసిని, రామ్మోహన్, పాల్గొన్నారు.

పండ్ల తోటలకు వందశాతం సబ్సిడీ

ఒంటిమిట్ట : పండ్ల తోటలు సాగు చేసుకోవాలనుకుంటున్న రైతులకు వందశాతం సబ్సిడీ కల్పిస్తామని ఏపీడీ సోమశేఖర్ రెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక జాతీయ ఉపాధిహామీ కార్యాలయంలో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి కూలీల శాతాన్ని పెంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ శివశంకర్ రెడ్డి, జాతీయ ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

'మాతోట'ను సందర్శించిన నాబార్డ్ డీడీఎం

సుండుపల్లె : మండల పరిధిలోని ఎగువ బిడికిలో మాతోట కార్యక్రమంలో భాగంగా గిరిజన రైతులు నాటిన మామిడి, జామ మొక్కలను నాబార్డ్ డీడీఎం విజయ్ విహారి బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మామిడి, జామ మొక్కలను సంరక్షించుకోవాలని రైతులకు సూచించారు. డ్రిల్లింగ్ చేసుకున్న బోర్ వెల్స్, మోటార్స్ బిగించుకొని రైతులు ఉపయోగించుకోవాలన్నారు. సకాలంలో మొక్కలకు నీరును అందించి ప్రతి ఒక్కరూ మొక్కలను కాపాడుకోవాలన్నారు. ఆర్‌హెచ్‌జీబీఎంఎస్‌ఎస్ సంస్థ జనరల్ సెక్రటరీ బివి రత్నం మాట్లాడుతూ మొక్కలను సంరక్షించుకునే బాధ్యత ప్రతి ఒక్కరి మీద ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మహమ్మద్ జావిద్, రవికుమార్, బాబు, వీరనాగయ్య, కమిటీ సభ్యులు, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

పన్నులు సకాలంలో చెల్లించండి

చిట్వేలి : పన్నులు సకాలంలో చెల్లించాలని జిల్లా పంచాయతీ అధికారిణి ధనలక్ష్మీ కోరారు. బుధవారం చిట్వేలి పంచాయతీ కార్యాలయాన్ని ఆమె పరిశీలించి పన్నుల వసూళ్లపై పలు సూచనలు ఇచ్చారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఉప సర్పంచ్ చొడవరం ఉమామహేశ్వర్ రెడ్డి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవడం అభినందనీయమని కొనియాడారు. గ్రామంలో పారిశుద్ధ్యం బాగుందని ఇలానే మండలంలోని అన్ని పంచాయతీలలో పనిచేసి ఆదర్శవంతంగా ఉండాలన్నారు. అనంతరం కార్యదర్శులతో ఆమె సమావేశమై తాగునీరు, తదితర అంశాలపై పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. డీఎల్‌పీఓ పార్వతీ, ఈఓపీఆర్‌డీ శివకుమార్, పంచాయతీ కార్యదర్శులు, పంచాయతీ సిబ్బంది నరసింహ, శివకుమార్ పాల్గొన్నారు.

అవినీతిపై విచారణ జరపాలి

రాయచోటి టౌన్ : హాకీ క్రీడాకారుల్లో జరిగిన అవినీతిపై విచారణ జరపాలని క్రీడల మంత్రి మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డికి అన్నమయ్య జిల్లా హాకీ అకాడమి సెక్రటరీ ఇడగొట్టు నాగేశ్వరావు, ధ్యాన్ చంద్ హాకీ అకాడమీ డైరెక్టర్ సుబహాన్ బాషా బుధవారం ఆయనకు వినతి పత్రం అందజేశారు. ఆంధ్రప్రదేశ్‌లో 2014 నుంచి 2022 వరకు ఎస్ఎస్‌డీసీ – 2011 నిబంధనలకు విరుద్ధంగా ఎన్నికలు నిర్వహించారని పేర్కొన్నారు. దీంతో జాతీయ హాకీ అకాడమీ గుర్తింపును రద్దు చేసిందని తెలిపారు.

బొప్పాయి సాగు.. లాభాలు బాగు

- నేడు వాణిజ్య పంటగా చెలామణి
- నేల స్వభావాన్ని బట్టి దిగుబడి
- మెళుకువలతో మంచి లాభాలు


విస్తారంగా సాగు చేసిన బొప్పాయి తోట

రాజంపేట రూరల్ : జిల్లా పరిధిలో వేల ఎకరాలలో విస్తారంగా సాగు చేస్తున్న పంటలలో బొప్పాయి ముందు వరుసలో నిలుస్తుంది. పోషక విలువలు కలిగిన పండ్ల రకాలలో బొప్పాయికి ఎనలేని ప్రాముఖ్యత ఉంది. ఒకప్పుడు పెరటి తోటలకే పరిమితమైన ఈ సాగు.. ప్రస్తుతం వాణిజ్య సాగుగా విరాజిల్లుతుంది. తక్కువ ఖర్చు ఉండటం, ఉద్యానవన శాఖ రాయితీలు ఇవ్వడం వలన రైతులు బొప్పాయి సాగు వైపు మొగ్గు చూపుతున్నారు. ఎకరాకు 40 నుంచి 50 టన్నుల దిగుబడి వస్తుంది. వాతావరణానికి అనువుగా ఉన్న రకాలను సాగు చేయడం, మెళుకవలు పాటించడం వలన లాభాలు గడించవచ్చు.

వాతావరణం, నేలలు

బొప్పాయి ఉష్ణ మండలం పంట, వేసవిలో 38 డిగ్రీల నుంచి 48 డిగ్రీల సెంటీ గ్రేడ్ వరకు వేడిని తట్టుకుంటుంది. ఉష్ణోగ్రత 10 డిగ్రీల కంటే తక్కువ ఉంటే మొక్క ఎదుగుదల, పిందె కట్టడం తగ్గుతుంది. దీనికి తోడు కాయ ముదరటం ఆలస్యం అవుతుంది. సారవంతమైన వండ్రు నేలలు, ఎర్రగరప నేలలు అనుకూలంగా ఉంటాయి. దీనికి తోడు నీరు ఇంకి పోయే రేగడి నేలలో కూడా సాగుకు అనుకూలంగా ఉంటుంది.

విత్తే విధానం

పండ్ల నుంచి తీసిన విత్తనాలను 40 రోజుల్లోపు విత్తుకోవాలి. ఆలస్యమైతే మొలకశాతం తగ్గి మొక్కలు ఏపుగా పెరగవు. ఎకరాకు డైయోషియస్ రకాలను 200 గ్రాములు, గైనో డైయోషియస్ రకాలను 20 గ్రాముల విత్తనం సరిపోతుంది. మొక్కల మధ్య 2–2.5 మీటర్ల దూరం ఉండేటట్లు 45:45:45 మీ.ల సైజులో గుంతలు తీసుకోవాలి. గుంతల నుంచి వచ్చిన మట్టికి 5 కిలోల పశువుల ఎరువు, 250 గ్రాముల సూపర్ ఫాస్ఫేట్ కలిపిన మిశ్రమంతో గుంత నింపుకోవాలి. జూలై, అక్టోబర్ లేదా ఫిబ్రవరి, మార్చి నెలలో 15 నుంచి 20 సెంటీ మీటర్ల ఎత్తు పెరిగి 45 నుంచి 60 రోజుల వయస్సు గల నారు మొక్కలను గుంతల మధ్యలో నాటు కోవాలి.

నీటి యాజమాన్యం

వేసవిలో ప్రతి ఆరు రోజులకు ఒకసారి, ఇతర కాలాలలో పది రోజులకు ఒకసారి తడులు ఇవ్వాల్సి ఉంటుంది. బొప్పాయికి రింగు పద్ధతిలో నీరు కట్టడం అవసరం. మొదలుకు నీరు తగలకుండా చుట్టూ మట్టి ఎత్తుగా వేసి పాదు చుట్టూ గాడి చేసి నీరు పారించాలి. డ్రిప్ పద్ధతిలో నీరు పట్టడం ఉత్తమం. మొదట్లో రోజుకు 4 లీటర్ల నీరు క్రమేణా పెంచుకుంటూ పూర్తి కాపు వచ్చేసరికి 16 లీటర్ల నీరు డ్రిప్ ద్వారా అందేటట్లు చూడాలి. డ్రిప్ ఇరిగేషన్ ద్వారా నీరు అందించినపుడు చెట్లు ఏపుగా పెరిగి ఉత్పాదక నాణ్యత పెరుగుతుంది.

సూక్ష్మధాతు లోపాలు

బొప్పాయిలో సూక్ష్మధాతు లోపాలు కనపడే సందర్భంలో పండ్ల నాణ్యత లోపించడం, దిగుబడులు తగ్గటం కాయ నిల్వ ఉండక పోవడం వంటివి జరుగుతాయి. ఇలాంటి లోపాలు కనిపించినపుడు మొక్క 3 నుంచి 4 మాసాల వయస్సు ఉన్నప్పుడు సూక్ష్మధాతువుల మిశ్రమ ద్రావణాన్ని మొక్కలపై స్ప్రే చేయాలి.

సస్య రక్షణ చర్యలు

- బొప్పాయిలో ఆశించు శిలీంద్ర తెగుళ్లు, వైరస్ తెగుళ్లు, మొజాయిక్, రింగ్‌స్పాట్, ఆకుముడత వెర్రి తెగుళ్లు పంటను ఆశించి అపార నష్టం కలగజేస్తుంది.
- తోటలో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి.
- అంతర్‌సేద్యం చేసేటప్పుడు చెల్ల వేర్లకు తగలకుండా జాగ్రత్త పడాలి.
- తెల్లదోమ, పేనుబంక నివారణకు లీటరు నీటికి 2 మి.లీ. డైమిథోయేట్ లేదా మిథైల్ డెమటాన్ 1.6 మి. మీ మెనోక్రోటో ఫాస్ లేదా 1 గ్రాము ఎసీపేట్ వంతున కలిపి చెట్టుపై స్ప్రే చేయాలి.

పంటకోత విధానం

- కాయలను సరైన పక్వదశలోనే కోయాలి. కాయలు చివరి బుడిపె పైభాగంపై పసుపు వర్ణంలో ఒకే చార ఏర్పడి ఉండాలి.
- ఒకటి కన్నా ఎక్కువ పసుపు చారలు ఉన్న కాయలు త్వరగా పండి పోయి చెడిపోతాయి. పక్వానికి రాని కాయలను కోయ కూడదు.
- ఎగుమతికి అనుకూలంగా ఉన్న కాయలను చెట్టు ఎత్తును బట్టి చేతితో కానీ కత్తితో కానీ పరికరాలను ఉపయోగించి కోయాలి.
- కాయలను నేలమీద పెట్టడం, విసిరి వేయటం చేయకుండా లోతు తక్కువగా ఉన్న ప్లాస్టిక్ క్రేట్లలో అమర్చాలి.
- కాయలపై గల తొడిమలను కత్తితో కోసి తొడిమ పొడవు ఒక సెంటీ మీటరు తక్కువగా ఉండేలా చూడాలి. నింపిన క్రేట్లను ఎండని తగలని చల్లని ప్రాంతంలో భద్ర పరచాలి.

రైతులు ఆర్‌బీకేలను సంప్రదించాలి



బొప్పాయి సాగు చేసే రైతులు వ్యవసాయ, ఉద్యాన అధికారుల సలహాలు, సూచనలు పాటించి సాగు చేస్తే మంచి దిగుబడి పొందవచ్చు. మీ సమీపంలోని ఆర్‌బీకేలలో పంట ఏ దశలో ఏఏ మందులు వాడాలో తెలుసుకోవచ్చు. రైతులకు కావాల్సిన ఎరువులు ఆర్‌బీకేలలో అందుబాటులో ఉన్నాయి. రైతులు ఆర్‌బీకేలను ఉపయోగించుకోవాలని కోరారు.

జి. రాజకుమారి, మండల వ్యవసాయ అధికారి, రాజంపేట

బొప్పాయి సాగు లాభదాయకం



బొప్పాయిని సాగు చేయడం ద్వారా మంచి లాభాలను పొందవచ్చు. బొప్పాయి సాగు చేసే రైతుకు పంట సాగుపై అవగాహన కలిగి ఉండాలి. మొక్కలు నాటినప్పటి నుంచి మెళుకువలతో సాగు చేస్తే రైతుకు నష్టం రాదు. ప్రతి ఏటా నేను బొప్పాయి సాగు చేసి లాభాలు గడిస్తున్నాను.

దాసరిరాజు రాజేంద్రరాజు, రైతు, పుల్లంపేట మండలం

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

రాజంపేట టౌన్ : రాజంపేట మండలం వెంకటపల్లె రోడ్డులోని నిజస్వరూపుని ప్రార్థనా మందిరంలో బుధవారం మందిరం పాస్టర్ కస్తూరి విశ్వప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించి ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చింది. రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఉచిత వైద్య శిబిరాలు ఎక్కడ నిర్వహించినా సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు సూచించారు.

మాటతప్పుతున్న చంద్రబాబు

రాయచోటి అర్బన్ : ప్రతిపక్షంలో ఉన్నప్పుడు విద్యుత్ చార్జీలు పెంచమని ప్రకటించిన ముఖ్యమంత్రి చంద్రబాబు.. ఇప్పుడు మాట తప్పుతున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు విమర్శించారు. బుధవారం సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తాము అధికారంలోకి వస్తే ప్రజలపై విద్యుత్ భారాలు మోపమని ప్రతిపక్షనేతగా ఉన్నప్పుడు చంద్రబాబు ప్రజలకు హామీ ఇచ్చారని తెలిపారు. కాగా మంగళవారం సచివాలయంలో విద్యుత్ రంగంపై విడుదల చేసిన శ్వేత పత్రం చూస్తే ప్రజలపై చార్జీల బారం మోపేలానే కనిపిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు.

టెట్, డీఎస్సీ కోచింగ్

రాయచోటి జగదాంబసెంటర్ : అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటిలోని విద్యానికేతన్ కోచింగ్ సెంటర్‌లో మైనార్టీ విద్యార్థులు (ముస్లిం, క్రిస్టియన్) లకు టెట్, డీఎస్సీ కోచింగ్ ఇవ్వనున్నట్లు సెంటర్ డైరెక్టర్ ఎం.లక్ష్మీమునికుమారి తెలిపారు. జిల్లాలోని నిరుద్యోగ అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 15వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలని ఆమె సూచించారు. మరిన్ని వివరాలకు కరెస్పాండెంట్ కె.సుధాకర్ 9550130802 నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి


కలెక్టర్ శ్రీధర్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి

రాజంపేట : నియోజకవర్గంలోని ప్రజల సమస్యలు పరిష్కరించడమే తన ధ్యేయమని రాజంపేట శాసన సభ్యుడు ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం నూతన జిల్లా కలెక్టర్ శ్రీధర్‌తో ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి భేటి అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని రాజంపేట మున్సిపాలిటీ, రాజంపేట రూరల్, నందలూరు, సుండుపల్లె, వీరబల్లి, సిద్ధవటం, ఒంటిమిట్ట మండలాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు ఎప్పటికప్పుడూ గుర్తించి వాటి పరిష్కారానికి కృషిచేస్తానన్నారు. ప్రజలసమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లానని తెలిపారు. ప్రధానంగా రైతులు, మహిళలు, గ్రామీణులకు ఎటువంటి సమస్య వచ్చిన వెంటనే స్పందించడం తన బాధ్యత అన్నారు. వారికి అన్ని వేళలలో అందుబాటులో ఉంటానన్నారు. గ్రామాల్లో తాగునీటి సరఫరా, వైద్యం, పారిశుద్ధ్యం, పంచాయతీల అభివృద్ధి, మహిళా భ్యున్నతి తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని ప్రకటించారు. అంతకముందుగా బాధ్యతలు చేపట్టిన కలెక్టర్‌కు ఆకేపాటి శాలువ కప్పి బొకేను అందచేసి ఘనంగా సత్కరించారు.

ఉపాధ్యాయుల చేతిలోనే విద్యార్థుల భవిష్యత్తు


ఉపాధ్యాయులకు సర్టిఫికేట్లు అందచేస్తున్న దృశ్యం

రాజంపేట టౌన్ : పిల్లల బంగారు భవిష్యత్తుకు దిశానిర్దేశం చేసే గురుతర బాధ్యత ఉపాధ్యాయుల దేనని రాజంపేట ఎంఈఓ–1 కొండూరు రఘునాథ రాజు, ఎంఈఓ–2 సుబ్బరాయుడు, పుల్లంపేట ఎంఈఓ, కోర్సు ఇన్‌చార్జి జీ.చక్రధర్‌రాజు అన్నారు. మండలంలోని బోయినపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలలో తొమ్మిది రోజులుగా నిర్వహించిన టీచ్ టూల్ శిక్షణా కార్యక్రమం బుధవారంతో ముగిసింది. ఈ కార్యక్రమంలో ఎంఈఓలు పాల్గొని మాట్లాడారు. విద్యతోనే పేదరికం లేని సమాజం సాధ్యం కాగలదని, అందువల్ల ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ప్రతి విద్యార్థి ఉన్నత విద్య అభ్యసిస్తే సమాజంలో పేదరికం తరిమికొట్టవచ్చని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ చూపితే మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. విద్యార్థులు ఒకటవ తరగతి నుంచి చదువుపై శ్రద్ధ చూపితే పైతరగతులకు వెళ్ళినప్పుడు విద్యార్థులు పాఠ్యాంశాలను సులువుగా అర్థం చేసుకొని మరింత బాగా చదివి ఉన్నత చదువులు చదివేందుకు సులువుగా బాటలు వేసుకోగలరని తెలిపారు. కాగా శిక్షణ పూర్తి చేసుకున్న ఉపాధ్యాయులకు ఆన్‌లైన్ ద్వారా పరీక్ష నిర్వహించగా అందరూ ఉత్తీర్ణులయ్యారు. వీరికి ఎంఈఓలు సర్టిఫికేట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో కోర్సు డైరెక్టర్ భారతి, ఆర్పీలు శివరాంప్రసాద్, రాజేష్, కృష్ణ, అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దీర్ఘకాలిక సమస్యలపై దృష్టి సారించండి


మురుగునీటిని పరిశీలిస్తున్న కమిషనర్. రాహుల్‌రెడ్డి

రాయచోటి అర్బన్ : పట్టణంలో నెలకొన్న దీర్ఘకాలిక సమస్యల పరిష్కారంపై దృష్టిని సారించాలని మున్సిపల్ కమిషనర్ వాసు అధికారులను ఆదేశించారు. బుధవారం ఉదయం రాష్ట్రమంత్రి రాంప్రసాద్‌రెడ్డి సోదరుడు రాహుల్‌రెడ్డి తదితరులతో కలసి పురవీధుల్లో కమిషనర్ వాసుబాబు కలియతిరిగారు. పలువార్డులలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్థానిక నేతలతో కలసి సమస్యలను స్వయంగా పరిశీలి ంచారు. 1వ వార్డులోని గుంతబజారులో మురుగునీరు, వర్షపు నీరు వీధిలో నిల్వ ఉండడాన్ని పరిశీలించారు. వెంటనే అక్కడ నీరు నిలువకుండా తగు చర్యలు తీసుకోవాలంటూ అధికారులను ఆదేశించారు. 3వ వార్డులోని మేదరవీధి,ఫైరింజన్ వీధి తదితర వీధుల్లో తిరుగుతూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పలువురు మున్సిపల్, ఇంజనీరింగ్, తాగునీటి సరఫరా విభాగం అధికారులు పాల్గొన్నారు.

అవయవాల లోపాలను గుర్తించాలి

రాయచోటి అర్బన్ : అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి ఆరునెలల చిన్నారుల వరకు అ వయవాలు లోపాల ఉంటే గుర్తించి, సకాలంలో చికిత్స అందించాలని జిల్లా ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ శివప్రతాప్ సూచించారు. బుధవారం పట్టణంలోని కొత్తపేట రామాపురం అర్బన్ హెల్త్ సెంటర్‌లో పిల్లల్లో పుట్టుకతో వచ్చే లోపాలను ఎలా గుర్తించాలి అనే అంశంపై స్టాఫ్ నర్సులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పుట్టుకతో వచ్చే లోపాలను సకాలంలో గుర్తించని పక్షంలో వారు జీవితాంతం వైకల్యాలను ఎదుర్కోవలసి వస్తుందని అన్నారు. చిన్నతనంలో వచ్చే వినికిడి లోపంతో పిల్లలు మూగవారిగా ఉండిపోతారన్నారు. అలాంటి పిల్లలకు సకాలంలో వైద్యం అందిస్తే మాట్లాడుతారని తెలిపారు. స్టాఫ్ నర్సులు పుట్టుకతోనే లోపాలున్న పిల్లలను గుర్తించి సత్వర చికిత్సకోసం మదనపల్లె పట్టణంలోని డీఈఐసీకి రెఫర్ చేయాలన్నారు. కార్యక్రమంలో చిన్నపిల్లల వైద్యుడు సురేష్‌రెడ్డి, పీహెచ్‌సీ, వైద్యవిధాన పరిషత్‌కు చెందిన వైద్యులు, స్టాఫ్‌నర్సులు పాల్గొన్నారు.

ఆకాశంలో దోబూచులాడుతున్న మబ్బులు

పుల్లంపేట : కొన్ని రోజులుగా ఆకాశంలో కారుమబ్బులు దోబూచులాడుతున్నాయి. కాసేపు ఎండ, కాసేపు మబ్బులు, వీలైతే చిటపట చినుకులు మాత్రమే కురవంతో ప్రజలు, రైతులు నిరాశ వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది సరైన వర్షాలు కురవకపోవడంతో బోరుబావుల్లో నీరు అడుగంటి పోవడంతో మండలంలో చేతికి వచ్చిన అరటి, బొప్పాయి, తమలపాకు పంటలు ఎండిపోయాయి. దీంతో చేతుల కష్టాలతో పాటు పెట్టుబడి కూడా రాకపోవడంతో రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయారు. సాగుకు సిద్ధమవుతున్న రైతన్నకు సరైన వర్షం కురవకపోవడంతో దిగాలుగా ఆకాశంపై చూస్తున్నాడు. వాన దేవుడు కరుణిస్తే తప్పా పంటలను సాగు చేయలేమంటూ అన్నదాతలు వాపోతున్నారు.

పశుగ్రాసంపై పాడి రైతులకు అవగాహన

సిద్దవటం : మండలంలోని నేకనాపురం గ్రామంలో పశుగ్రాస వారోత్సవాల సందర్భంగా బుధవారం పాడి పశువుల రైతులకు పశుగ్రాసం పెంపకంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించామని పశు సంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ డి. శారద తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాడి పశువులకు హైబ్రిడ్(ఏపీఎస్ఎన్) నెపీరియల్ పశుగ్రాసం వాడటం వలన పాల ఉత్పత్తి అధికంగా ఉంటుందని రైతులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ రమణయ్య, సిద్దవటం పశువుల ఆసుపత్రి అసిస్టెంటు డైరెక్టర్ లక్ష్మీదేవి, భాకరాపేట పశువైద్యాధికారి డాక్టర్ శివశంకర్, మాచుపల్లె వైద్యాధికారి డాక్టర్ స్వేత గ్రామ సర్పంచ్ ఈశ్వర్‌రెడ్డి, వెటనరీ అసిస్టెంటు, పాడి పశువుల రైతులు పాల్గొన్నారు.

టక్కోలు సర్పంచ్, ఉప సర్పంచ్ రాజీనామా

సిద్దవటం : మండలంలోని టక్కోలు గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్ బుధవారం రాజీనామా చేశారు. సర్పంచ్ బి. లక్ష్మిదేవి, ఉప సర్పంచ్ నిమ్మకాయల లక్ష్మిదేవి రాజీనామా పత్రాలను కడపలోని జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్‌రెడ్డికి అందజేశారు. గ్రామ పెద్దలు గతంలో వైఎస్సార్‌సీపీ మద్దతుదారులైన సర్పంచ్, ఉప సర్పంచ్ పదవీ కాలం 3 సంవత్సరాలు, టీడీపీ మద్దతుదారులకు 2 సంవత్సరాలు ఇవ్వాలని ఒప్పందం కుదుర్చుకున్నారు. మూడు సంవత్సరాల పదవీ కాలం ముగియడంతో సర్పంచ్, ఉప సర్పంచ్ పదవులకు రాజీనామా చేశామని చెప్పారు.

డ్రగ్స్‌మాఫియాను అరికట్టాలి

రాయచోటి అర్బన్ : డ్రగ్స్‌మాఫియాను కట్టడి చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి జక్కల వెంకటేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. డ్రగ్స్ మాఫియా కట్టడిలో పాలకుల వైఫల్యాన్ని నిరసిస్తూ ఏఐవైఎఫ్ రాష్ట్రసమితి పిలుపు మేరకు బుధవారం ఏఐవైఎఫ్ కార్యకర్తలు పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన ప్రదర్శన చేశారు. మాదక ద్రవ్యాల వినియోగం వలన కలిగే నష్టాలపై యువతను మరింత చైతన్యవంతులను చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు.

ఆయిల్ పామ్ సాగుపై అవగాహన


ఆయిల్ ఫామ్ సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఉద్యాన అధికారి జి సురేష్ బాబు

పెనగలూరు : ఉద్యానశాఖ సువెన్ ఆగ్రో ఇండస్ట్రీ ఆధ్వర్యంలో బుధవారం ఆయిల్ పామ్ సాగుపై పెనగలూరు మండలంలోని కట్టావారిపల్లె, ఈటమాపురం, సింగారెడ్డిపల్లె గ్రామాలలో రైతులకు ఉద్యాన అధికారి జి సురేష్ బాబు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు ఆయిల్ ఫామ్ సాగుకు ప్రభుత్వం అందించే రాయితీలను తెలియజేశారు. ప్రభుత్వం ఎంపిక చేసిన కంపెనీ ద్వారా రైతులకు హెక్టార్‌కు 143 మొక్కలను ఉచితంగా పంపిణీ చేస్తుందన్నారు. మొదట నాలుగు సంవత్సరాలకు ఒక్కో సంవత్సరానికి రూ. 5,250 చొప్పున మొత్తం నాలుగు సంవత్సరాలుగా రూ. 21 వేలు, అలాగే అంతర పంటల సాగుచేస్తే మొదటి నాలుగేళ్లకు రూ. 21 వేలు రాయితీ రైతు ఖాతాలో జమ చేస్తామని, రైతులు ప్రత్యామ్నాయ పంటగా ఆయిల్ ఫామ్ సాగుకు రైతు సేవా కేంద్రాలు ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. సువెన్ ఆగ్రో ఇండస్ట్రీ మేనేజర్ కొండారెడ్డి, వీహెచ్ఏ సాయికుమార్ పాల్గొన్నారు.

పచ్చి మేపుతో పాడి అభివృద్ధి


మాట్లాడుతున్న జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ సి శారదమ్మ


ఒంటిమిట్ట : పచ్చిమేపుతో పాడి అభివృద్ధి చెందుతుందని జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ సి శారదమ్మ అన్నారు. మండల పరిధిలోని రాచపల్లిలో పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో పశుగ్రాస వారోత్సవాలు బుధవారం నిర్వహించారు. ఈ వారోత్సవాలకు ముఖ్య అతిధిగా జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ సి శారదమ్మ, డిప్యూటీ డైరెక్టర్ టీవీ రమణయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జూలై 7 నుంచి 14వ తేదీ వరకు పశుగ్రా వారోత్సవాలు నిర్వహిస్తామని తెలిపారు. పచ్చిమేత అందించడం వలన పాడి అభివృద్ధి చెందుతుందన్నారు. పశుగ్రాసంపైన ప్రత్యేక శ్రద్ధ వహించాలని రైతులకు సూచించారు. స్థానిక ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు ఉమా ఆధ్వర్యంలో రాయపల్లి గ్రామంలోని సుధాకర్ డైరీ ఫారంలో పశుగ్రాసాల సాగు, పాడి పశువుల పోషణలో వివిధ పశుగ్రాసాల ప్రాముఖ్యత గురించి వివరించారు. పాడిపరిశ్రమ ద్వారా యువత ఎంతోమంది ఉపాధి పొందవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక పశువైద్యశాల సిబ్బంది గిరి, రాణి, ట్రైనింగ్ పొందుతున్న సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోండి


ఎంఈఓకు వినతిపత్రాన్ని అందజేస్తున్న ప్రైవేటు ఉపాధ్యాయులు

గాలివీడు : ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తూ ట్యూటోరియల్స్ నిర్వహిస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని ఎంఈఓ నాగరాజును ప్రైవేటు ఉపాధ్యాయులు కోరారు. బుధవారం ఎంఈఓను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకు సెక్షన్ 28 ఆర్టీఈ యాక్టు 2009 ప్రకారం ప్రభుత్వ ఉపాధ్యాయుడు ప్రత్యక్షంగా కానీ పరోక్షంగా కానీ ఎలాంటి ట్యూషన్స్ లేదా ట్యూటోరియల్స్ నిర్వహించకూడదన్నారు. అయితే గాలివీడులో కొందరు ప్రభుత్వ ఉపాధ్యాయులు నిబంధనలను ఉల్లంఘిస్తున్నారని తెలిపారు.

కార్మిక వ్యతిరేక విధానాలపై సమరం


రాయచోటి అర్బన్: కలెక్టర్‌కు వినతి పత్రాన్ని అందచేస్తున్న కార్మిక సంఘాల నాయకులు


లక్కిరెడ్డిపల్లి: సీడీపీఓకు వినతిపత్రం అందజేస్తున్న ఐసీడీఎస్ ప్రాజెక్టు అధ్యక్షురాలు సుకుమారి


చిట్వేలి: తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

రాయచోటి అర్బన్ : కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను వెంటనే రద్దుచేయాలని సీఐటీయూ అనుబంధ సంఘాలు యూఈసీడబ్ల్యూయూ, యూఈఈయూ నేతలు జిల్లా కలెక్టర్ సి.శ్రీధర్ అందజేశారు. అనంతరం కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ కార్మిక వ్యతిరేక చట్టాలను వెంటనే రద్దుచేయాలని, స్కీమ్ వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని, కార్మికులకు మినిమం స్కేల్ రూ. 26 వేలకు పెంచాలంటూ డిమాండ్ చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లను అమలులోకి తెచ్చిందని తెలిపారు. విద్యుత్ రంగంలో పనిచేసే కాంట్రాక్టు కార్మికులు, ఉద్యోగులకు జీతాలను పెంచి ఉద్యోగ భద్రతను కల్పించాలంటూ కోరారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి రామాంజులు, ఉపాధ్యక్షుడు ఏ.వి. రమణ, యూఈఈయూ నేతలు సుబ్రమణ్యంరాజు, రెడ్డెప్ప, నాగేష్‌గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ రామకృష్ణ, సభ్యులు రామాంజులు, మణి తదితరులు పాల్గొన్నారు.

నిరసన

నేషనల్ డిమాండ్స్ డేను పురస్కరించుకుని బుధవారం రాయచోటిలో సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో ఆశా, మున్సిపల్, విద్యుత్, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నేతలు చెన్నయ్య, శంకరయ్య, రాంబాబు, మధుకర్, రంగనాయకులు, గంగాధర్, భాగ్యలక్ష్మి, సిద్దమ్మ, విజయమ్మ, అరుణ ,నాగమణి, సుమల, నరసింహులు శ్రీరాములు, వెంకటలక్ష్మి, ఈశ్వర్‌రెడ్డి, చంద్రశేఖర్, శేఖర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

లక్కిరెడ్డిపల్లి : రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని లక్కిరెడ్డిపల్లె ఐసీడీఎస్ ప్రాజెక్టు అధ్యక్షురాలు సుకుమారి కోరారు. బుధవారం ఐసీడీఎస్ కార్యాలయంలో జాతీయ అంగన్ వాడీల కోర్కెలు దినోత్సవం సందర్భంగా ఐసీడీఎస్ సీడీపీఓ పద్మావతికి అంగన్‌వాడీ కార్యకర్తలతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీ అమలు చేయాలని, ఐఎల్‌సీ సిఫార్సు ప్రకారం కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు గౌరవ అధ్యక్షురాలు ప్రభావతి, కార్యదర్శి ఓబులమ్మ, తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ ధర్నా

చిట్వేలి: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కార్మిక వ్యతిరేక చట్టాలకు నిరసనగా బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. సీఐటీయూ కేంద్ర కమిటీ, కార్మిక డిమాండ్ డే పిలుపు మేరకు ధర్నా చేశారు. లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని, కనీస వేతనాలు రూ. 26 వేలు చేయాలని, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను ఆపాలని, విభజన చట్టం మేరకు కడప ఉక్కు పరిశ్రమను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ సుమకి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు ఎదునూరు సుజాత, పగడాల సుధామణి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పందికాళ్ల మణి, నాగరత్న, సులోచన, సుబ్బరత్న, శ్యామల, రాధ, సృజన, లక్ష్మీకుమారి, మాధవి, విఆర్ఏలు సుధాకర్, శివయ్య తదితరులు పాల్గొన్నారు.